భువనగిరి ఖిల్లాపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

- గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి
- నేడు క్యామ మల్లేశ్ నామినేషన్ దాఖలుకు తరలిరావాలని పిలుపు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్తు వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బలహీనవర్గాలు, రైతులు, గ్రామీణ ప్రజల ప్రతినిధిగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ తిరుగులేని విజయం సాధించబోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలల వ్యవధిలోనే విపరీతమైన ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నదని, ఈ పార్లమెంటు స్థానంలో మూడో స్థానానికి కాంగ్రెస్‌పార్టీ పరిమితం కానున్నదని చెప్పారు. ప్రజలకు గత అసెంబ్లీ ఎన్నికల ముందిచ్చిన హామీలనే నెరవేర్చకుండా సమస్యలను పక్కదారి పట్టించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రోజుకో కొత్త అంశాన్ని తెరమీదకి తెచ్చి ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్న కుటిల యత్నాలను ప్రజలు గమనించారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా కొనసాగించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్నదని ఆయన విమర్శించారు. నేడు భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, మైనార్టీ విభాగం నాయకుడు నవాజ్, రైతు విభాగం నాయకులు రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బీసీ విభాగం నేత జగన్‌యాదవ్, యువజన విభాగం నాయకుడు కలకొండ బాషా పాల్గొన్నారు.

అవినీతి అక్రమాలను ఎండగట్టడానికి సమాచార హక్కు చట్టం ఆయుధంలాంటిది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స.హ చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : దేశంలో చట్టాలు సమగ్రంగా అమలు కావాలంటే ఆర్టీఏ యాక్టును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో సమాచార హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువస్తే, జవహర్‌లాల్‌నెహ్రూ దేశ ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారన్నారు. ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేయగా, రాజీవ్ గాంధీ దేశానికి టెక్నాలజీ పరిచయం చేశారన్నారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన జీవోను ప్రభుత్వం అందరికీ ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో ఆర్టీఏ దరఖాస్తులు తీసుకునేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఆర్టీఏ చట్టం వచ్చిన తర్వాత సామాన్యుడి గౌరవం పెంచిందన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గతంలో అధికారులు సామాన్యులను పరిగణనలోకి తీసుకునేవారు కాదని, ఆర్టీఏ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 140 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన అవసరం అధికారులకు ఏర్పడిందన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లను త్వరలోనే నియమిస్తామని ప్రభుత్వం పేర్కొందన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కన్నకలలు నిజం కావాలంటే ఆర్టీఏ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేధావులు, ఉద్యోగులు, జర్నలిస్టులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు ద్వారానే మన దేశాభివృద్ధి ఆధారపడిందని, దీనిని దేశంలోని యువత ప్రతి ఇంట్లో తమ కుటుంబసభ్యులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. సమాచార హక్కు చట్టంలో రాజకీయ నాయకులు కూడా భాగస్వామ్యం కావాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాల కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఏ కరీం, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ పాషా, ఫెడరేషన్ అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర నాయకులు శంకర్, గంట విజయసాగర్‌రెడ్డి, సురేశ్, మణి, భిక్షపతి, శ్రీనివాస్, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

చేరుకున్న ఈవీఎంలు.. భద్రపర్చిన అధికారులు

రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈవీఎంలను భద్రపర్చుతున్న ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు ఆదివారం గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకున్నాయి. ఈవీఎంలను ఆయా రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఆర్డీవో అనంతరెడ్డి స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. 3,38,096 ఓటర్లుండగా.. ఇందులో 1,70,172 పురుషులు., 1,67,899 స్త్రీలు., 35 మంది థర్డ్ జండర్స్ ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 319 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే నెల 13న పోలింగ్ జరుగనుండగా.. జూన్ 4న భువనగిరిలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను కూడా ఎన్నికల అనంతరం భువనగిరికి తరలించనున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చామని, స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట భద్రతను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

షాద్‌నగర్ మినీ స్టేడియంలో ఈవీఎంలను భద్రపరుస్తున్న ఎన్నికల నిర్వహణ సబ్బంది

షాద్‌నగర్ మినీ స్టేడియంలో ఈవీఎంలను భద్రపర్చిన అధికారులు

షాద్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం మిషన్లు షాద్‌నగర్‌కు చేరినట్లు ఆర్డీవో, ఎన్నికల నిర్వహణ అధికారి వెంకటమాధవరావు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని మొత్తం 263 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 368 వీవీ ప్యాట్లు, 328 బ్యాలెట్ ఈవీఎంలు, 328 ఈవీఎం కంట్రోల్ యూనిట్స్ వచ్చాయని వివరించారు. ఈవీఎం మిషన్లతో పాటు ఇతర సామగ్రిని షాద్‌నగర్ మినీ స్టేడియంలోని గదుల్లో భద్రపర్చి గదులను సీజ్ చేశామని తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

యాచారంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

యాచారం, ఏప్రిల్ 21 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మండల కేంద్రంతోపాటు పలు సమస్యాత్మక గ్రామాల్లో సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ శంకర్‌కుమార్ సూచించారు. ప్రజల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు, ఓటర్ల స్వేచ్ఛకు భరోసా కల్పించేందుకు రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు కవాతును నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవన్నారు. వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. డబ్బు, మద్యం సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటనారాయణ, గోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలమంతా.. కాసాని వెంటే..

- పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థిని మెజార్టీతో గెలిపించుకుంటాం
- బీసీలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాల్సిందేనంటున్న బీసీ నేతలు



రంగారెడ్డి, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : బీసీల అభ్యున్నతికి జీవితాన్ని ధారబోసిన గొప్ప నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ అని బీసీ నేతలు కొనియాడుతున్నారు. 96 కులాలను ఐక్య వేదిక పేరుతో ఏకతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని కాసాని ఘనతను వివరిస్తున్నారు. పార్లమెంటులో బడుగు బలహీన వర్గాల గొంతుక వినబడాలంటే కాసానిని గెలిపించుకుని తీరాలని బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి. రాజ్యాధికారానికి దూరం కావడం వల్లనే బీసీలు రాణించలేకపోతున్నారని, చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకుందామని నేతలు పేర్కొంటున్నారు. బీసీలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలతోపాటు నిస్వార్థంతో కూడిన ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించి బీసీల శక్తిని, ఐక్యతను చాటుదామని పిలుపునిస్తున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా.. కాసాని వెన్నంటే ఉండి ఆయన గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా కాసాని విజయానికి పాటుపడదామని నేతలు కోరుతున్నారు.

బీసీల సత్తా చాటుతాం : కాశీనాథ్ యాదవ్

బీసీలు కేవలం రాజకీయ పార్టీలకు ఓటు బ్యాంకులు కాదు. మాకంటూ ఎంతో ఆత్మాభిమానం ఉన్నది. పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుని మా సత్తా చాటుతాం. బీసీల్లో ఐక్యతపై కాంగ్రెస్ నేతలు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. పార్టీలకు అతీతంగా బీసీలంతా ఈ ఎన్నికల్లో సమైక్యంగా నిలబడి బీసీ బిడ్డ కాసానిని గెలిపించుకుని బీసీలంటే అల్లాటప్పాకాదని నిరూపిస్తాం. బీసీ ఓటర్లు సైతం రాజకీయ పక్షాల మోసపూరిత మాటలను గుర్తించాలి. బీసీలకు ప్రాధాన్యతనిచ్చిన పార్టీకి అండగా నిలవాలి.

రాజకీయాలకతీంగా ఒక్కటవుతాం : అబ్దుల్ సత్తార్

పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థిగా బీసీ బిడ్డ కాసానికి టికెట్ ఇచ్చి బీఆర్ఎస్ ఈ వర్గంపై తన చిత్తశుద్ధిని చాటుకున్నది. పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెనుకబడిన వర్గానికి చెందిన మా నేతను చేవెళ్లలో భారీ మెజార్టీతో గెలిపించుకుని బీసీల్లో ఐక్యతను నిరూపించుకుంటాం. ఇతర పార్టీలు బీసీ వర్గాలకు సీటు ఇవ్వకపోవటంతో పాటు పైగా అవహేళనగా మాట్లాడటం సరికాదు. బీసీలు సైతం ఈ ఎన్నికల్లో విజ్ఞతతో వ్యవహరించాలి. చేవెళ్లలో కాసానిని గెలిపించుకుని అహంకారపూరిత నేతలకు తగిన గుణపాఠం నేర్పాలి.

ఏకమై అహంకారులకు బుద్ధి చెబుతాం : నాగేశ్, ఆరెకటిక సంఘం

ఇంకా ఎంతకాలం బీసీలందరం ఒక్కటి కాకుండా ఉందాం. ఇప్పటికైనా ఏకమై అహంకారంతో బీసీలను చులకన చేసి మాట్లాడుతున్న నేతలకు బుద్ధి చెబుతాం. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని బీసీల సత్తా ఏంటో చూపిద్దాం. ప్రతి ఇంటికి తిరిగి బీసీలను కూడగడుదాం. కొంతమంది అహంకారపరుల నోటికి తాళం వేయాలంటే మన ఓట్లు కాసాని జ్ఞానేశ్వర్‌కు వేసి గెలిపించాలి.

కాసాని గెలుపు కోసం ప్రచారం చేస్తాం : కర్ణ కోట బాలింగోజీ బీసీ సంఘం నాయకుడు

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవడానికి ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం చేస్తాం. బీసీ ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్నది. మనం తలుచుకుంటే బీసీ అభ్యర్థి గెలువడమనేది పెద్ద సమస్య కాదు. ప్రతి బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓట్లు వేసి గెలిపించుకుందాం. కారు కూతలు కూస్తున్న వారికి కంట్లో కారం కొట్టిన్నట్లు కావాలి. బీసీలను ఇంత చులకన చేస్తున్న వారికి గుణపాఠం చెప్పుదాం.

భారీ మెజార్టీ అందిస్తాం : రాములు

తెలంగాణలో బీసీ సంక్షేమం కోసం పాటుపడిన ఏకైక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నాయకుడికి టికెట్ కేటాయించడం హర్షణీయం. బీసీ ఓటర్లు అందరూ ఏకమై కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది.

బీసీలు రాజకీయంగా ఎదుగాలి : జంగయ్య

బీసీలు రాజకీయంగా ఎదుగాల్సిన అవసరం ఉన్నది. బీఆర్ఎస్ పార్టీ అధినేత చంద్రశేఖర్‌రావు బీసీలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనేక మంది బీసీలకు పార్టీ తరపున టికెట్ ఇచ్చారు. బీసీలందరూ బీసీ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

కాసాని గెలుపు ఖాయం : కావలి మల్లేశ్ ముదిరాజ్, హైతాబాద్, షాబాద్ మండలం

పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపొందడం ఖాయం. 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలమంతా ఏకతాటిపైకి వచ్చి కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని పార్లమెంట్‌కు పంపిద్దాం. చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చూపుదాం.

బీసీ నేతను గెలిపించుకుందాం : పరిగి గణేశ్ గౌడ్, మల్లారెడ్డిగూడ, షాబాద్ మండలం

బీసీ నేతను ఎంపీగా గెలిపించుకుంటే బీసీల గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఎంతో సేవ చేసిన కాసాని జ్ఞానేశ్వర్‌కు ఈ ప్రాంతంపై మంచి పట్టున్నది. ఎన్నో రోజుల తర్వాత ఒక బీసీ నాయకుడికి అవకాశం వచ్చింది. ఇతర పార్టీల్లో బీసీలను పట్టించుకునేవారే కరువయ్యారు. పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి మన ఓటు మన నాయకుడికే వేసుకుని భారీ మెజార్టీతో బీసీ నేత జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం.

కాసాని గెలుపు అహంకారులకు చెంపపెట్టు కావాలి : రేగొండి శ్రావణ్ కుమార్, మంబాపూర్ గ్రామం

బీసీలపై కాంగ్రెస్ నేతలు అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. తిరిగి బీసీలనే అవమానపర్చేలా మాట్లాడడం సిగ్గుచేటు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు అహంకార నాయకులకు చెంపపెట్టు కావాలి. కాసాని విజయం కోసం బీసీలు సైనికుల్లా ముందుకు కదలాలి.

బీసీలంతా ఏకమై సత్తా చాటాలి : మల్లేశం, ఖానాపూర్ గ్రామం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను సీఎం కేసీఆర్ గుర్తించి చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఆయా మండలాలు, గ్రామాల బీసీలందరం మూకుమ్మడిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను బలపరుస్తూ రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకొని బీసీల సత్తా చాటాలి.

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి : జి.రాజేందర్ గౌడ్, వికారాబాద్

చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా టీఆర్ఎస్ తరపున బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు మంచి అవకాశం కల్పించడం సంతోషకరం. బీసీలకు దమ్ముంటే కాసానిని ఎంపీగా గెలిపించుకోవాలని ఓ నాయకుడు విసిరిన సవాలుకు మనమందరం ఏకమై ఓటు ద్వారా సమాధానం చెప్పాలి. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉన్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా చేసిన అనుభవం జ్ఞానేశ్వర్‌కు ఉన్నది. అత్యధికంగా ఉన్న బీసీలంతా పార్టీలకతీతంగా ఆయనకు ఓటేయాలి.

బీసీల గళం వినిపించాలి : గిరీశ్ కొఠారీ, వికారాబాద్

బీసీలందరం ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం. అప్పుడే బీసీల ఐక్యత సమాజానికి చాటినట్లు అవుతుంది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గానికి పెద్దపీట వేసి బీసీలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బీసీల సత్తాను చాటేందుకు ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడై బీసీ నాయకుడి గెలుపునకు కృషి చేయాలి.

మా నాయకుడిని మేము గెలిపించుకుంటాం : మల్లేశ్ ముదిరాజ్, మోత్కూరు, దోమ మండలం

96 కులాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీ గెలిపించి మా బీసీల సత్తా చాటుతాం. ఓట్ల సమయంతో బీసీలను పావులుగా వాడుకొని అధికారం దక్కించుకుంటున్న రెడ్డి వర్గానికి చెందిన నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో చుక్కలు చూపిస్తాం. చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం. మాట్లాడే ముందు కులమతాలకు అతీతంగా మాట్లాడాలనే విషయాన్ని ఆయా పార్టీల నాయకులు గుర్తుంచుకొని మాట్లాడాలి.

బీసీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జోగు నర్సింహులు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

బీఆర్ఎస్ అధినేత బీసీ నాయకుడికి ఇచ్చిన అవకాశాన్ని బీసీలందరూ ఏకమై సద్వినియోగం చేసుకోవాలి. అహంకారంతో మాట్లాడే నాయకులకు ఓట్లతో బుద్ధి చెప్పాలి. బీసీల మధ్య చిచ్చుపెట్టి ఏకం కాకుండా చేస్తున్నారనే విషయాన్ని బీసీలు గమనించి ఐక్యతతో ముందుకెళ్లాలి. కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుదాం. ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటు వేసి మన ఐక్యతను చాటిచెప్పాలి. అగ్రకులాల నేతలు మనందరినీ ఓటు రాజకీయాలకు బలిపశువుల్లా వాడుకుంటున్నారు.

నిరంతరం.. అంతరాయం..

డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై పెరిగిన లోడు

సరఫరాలో తరచూ స్వల్ప అంతరాయం



సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ చర్యలు చేపట్టినా క్షేత్ర స్థాయిలో తరచూ సరఫరాలో అంతరాయం షరామామూలే అన్నట్లుగా మారింది. విద్యుత్ సబ్ స్టేషన్‌ల నుంచి ఫీడర్ల ద్వారా కాలనీ మధ్య ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ (డీటీఆర్) నుంచి ఇంటికి వెళ్లే లైన్లపై వేసవి కాలంలో లోడ్ గణనీయంగా పెరుగుతున్నది. దీనివల్ల డీటీఆర్ వద్ద ఉండే ఫ్యూజ్ బాక్సులో పవర్ ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. అందుకు ప్రత్యేక నిదర్శనం శనివారం సాయంత్రం హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తింది. దీంతో 15 నిమిషాల పాటు సరఫరా నిలిచిపోయింది. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం 5, 10, 15 నిమిషాల పాటు నగరంలో ఒక్క చోటే కాదు.. పలు చోట్ల నెలకొన్నది. అంతరాయం తలెత్తిన చోట సమస్యను సరిచేయాలంటే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది, లేదా సీబీడీ (సెంట్రల్ బ్రేక్ డౌన్) సిబ్బంది రావాల్సి ఉంటుంది. వారు అందుబాటులో లేకుండా సెక్షన్ పరిధిలోని లైన్ మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకు సమాచారం తెలిస్తే దాన్ని వెంటనే పునరుద్ధరించాల్సి ఉంటుంది.

క్షేత్ర స్థాయిలో సిబ్బంది తక్కువ..

ఒక విద్యుత్ కార్యాలయం సెక్షన్ పరిధిలో 20-30 వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉంటే, వాటికి విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ నుంచి వచ్చే ఫీడర్ల పరిధిలో పదుల సంఖ్యలో డీటీఆర్‌లు ఉంటాయి. ఇలా పదుల సంఖ్యలో ఉన్న డీటీఆర్‌లపై వేసవిలో తరచూ లోడ్ పెరగడం వల్ల ఒకే సమయంలో పలు చోట్ల తలెత్తే అంతరాయాలను పునరుద్ధరించేంత సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండడంలేదు. ఈ కారణంగా ఒక చోట తలెత్తిన అంతరాయాన్ని సరిచేసి మరో చోటుకు వెళ్లాల్సి ఉంటుంది. డీటీఆర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ బాక్సులో సమస్యను పరిష్కరించాలంటే 5-10 నిమిషాల సమయం పడుతుంది. దీన్ని సరి చేసేందుకు క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని సరఫరాను పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది తక్కువ ఉండడంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లి మరమ్మతులు చేయడానికి కొంత సమయం పడుతున్నది.

ఇలా ప్రతి రోజూ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోనే ఎక్కువ అంతరాయాలు వస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇది స్వల్ప కాలం అంతరాయం తప్ప, విద్యుత్ కోతలు కావని, సరఫరా నిలిచిపోయిన చోటుకు సిబ్బంది వెళ్లి సరి చేసేందుకు కొంత సమయం పడుతున్నది. సబ్ స్టేషన్‌ల నుంచి మెయిన్ విద్యుత్ లైన్లు అయిన 33/11 కేవీల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉండదని, ఈ లైన్లకు ఇండ్లకు మధ్య ఉండే ట్రాన్స్‌ఫార్మర్ల వద్దే ఎక్కువగా అంతరాయం ఎదురవుతున్నదని అధికారులు పేర్కొంటున్నారు.